క్లుప్తంగా

నేటి నుంచి పీసా ఎన్నికలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో 71 పీసా గ్రామసభలకు వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ ఎన్నికలు ఈ నెల 2 తేదీ నుంచి 4వ తేదీ వరకు నిర్వహిస్తామని ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల మేరకు ఎన్నికలు జరిపిస్తామని చెప్పారు.

తొలి సంతకాల అమలు కోసం పోరాటం

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి తొలి సంతకం చేసిన డీఎస్సీ నోటిఫికేషన్, గిరిజన శాఖ మంత్రి తొలి సంతకం చేసిన గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంల నియామకం కోసం త్వరలోనే పోరుబాట పడతామని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన హక్కులు, ఐటీడీఏల మనుగడ, గిరిజన సంక్షేమం కోసం ఐక్య పోరాటాం చేస్తామని తెలిపారు. తక్షణమే తల్లికి వందనం అమలు చేయాలని కోరారు.

ఘనంగా గోదాదేవికి తిరువీధి



గోదాదేవి అమ్మవారిని పూలపల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖినది నదీతీరాన వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వేకువ జామున గోవింద మాలలు ధరించిన భక్తులు గోదాదేవి అమ్మవారికి బాజాభజంత్రీలతో పల్లకిలో తిరువీధి నిర్వహించారు. ప్రతి ఏటా నెల రోజుల పాటు ధనుర్మాసోత్సవ పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు ఆలయ అర్చకుడు పి. శ్రీనివాసాచార్యులు, భరత్ ఆచార్యుల ఆధ్వర్యంలో గోదాదేవి సమేత వేణుగోపాల స్వామివారి నామాలతో నగరసంకీర్తనలు చేయడం, రెండు కిలోమీటర్ల దూరం కలినడకన తిరువీధి చేయనున్నట్లు తెలియజేశారు. ప్రతిరోజూ వేకువ జామున పూజలు చేసిన అనంతరం భక్తులందరూ నగరసంకీర్తనలు చేయడం, గోవిందనామాలు చదివి వినిపించడం నిర్వహిస్తున్నారు. నగర సంకీర్తనలతో తిరిగి ఆలయానికి చేరుకున్న భక్తులందరూ పూజలు నిర్వహిస్తారు. ఈ మేరకు అమ్మవారికి భక్తులు సమర్పించిన వస్త్రాలు అలంకరించి పూలతో ప్రత్యేక అలంకరణ చేసిన పల్లకీలో తిరువీధి చేశారు. నిర్వాహకులు భక్తులందరికీ తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

జంఝావతిపై పాలకులు నోరు మెదపాలి

పార్వతీపురంటౌన్: జంఝావతి ప్రాజెక్టుపై జిల్లా పాలకులు నోరుమెదపాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి, జాతి మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు వంగల దాలినాయుడు కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో, ఒడిశాలో, కేంద్రంలో అనుకూల ప్రభుత్వాలు ఉండడంతో జంఝావతి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు ప్రయత్నించాలన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టులపై నదుల అనుసంధానికి ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి, ప్రాజెక్టు పూర్తికి ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేవారు. ఈలోపు రబ్బరు డ్యామ్, లిఫ్ట్ కెనాల్ పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కనీసం ప్రాజెక్టుపై అధికారులతో సమీక్ష చేయాలని, రైతులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని అభిప్రాయ పడ్డారు. ఎన్నికల సమయంలో గుర్తుతెచ్చుకుని జంఝావతిని ఎన్నికల హామీగా రాజకీయ పార్టీలు వాడుకుంటున్నాయన్నారు. జంఝావతి పూర్తయితే కొమరాడ, పార్వతీపురం, సీతానగరం, గరుగుబిల్లి, మక్కువ తదితర మండలాల్లో పంటలు పుష్కలంగా పండి ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయన్నారు. రబ్బరు డ్యాం, లెఫ్ట్ కెనాల్ పూర్తిస్థాయిలో పనిచేసేలా, ప్రాజెక్టు పూర్తయ్యేలా పాలకులు ప్రయత్నాలు చేయాలని కోరారు.

నేడు నీటి సరఫరా నిలిపివేత

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధిలోని పలు ప్రాంతాలకు ఈ నెల 2న నీటి సరఫరా నిలుపుదల చేయనున్నామని కమిషనర్ జె.రామప్పలనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా పాలకొండ రోడ్డులోని పైపులైన్ల మరమ్మతులకు గురైన కారణంగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు. డోలపేట హెడ్ వాటర్ ట్యాంకు పరిధిలోని డోలపేట, పానుగుటివలస, బుచ్చెంపేట, మారుతీనగర్, విద్యానగర్, వరలక్ష్మీనగర్ తదితర ప్రాంతాలకు ఈ అంతరాయం ఏర్పడనుందని అన్నారు. ఆయా ప్రాంతాల్లో వాటర్‌ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేయనున్నామని తెలిపారు.

విద్యార్థికి అభినందన

వంగర: వంగర గ్రామానికి చెందిన పొట్టా చంద్రశేఖర్‌ను మంగళవారం గ్రామస్తులు అభినందించారు. చంద్రశేఖర్ ఇటీవల విడుదలైన సీఏ (చార్టెడ్ అకౌంటెంట్) ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గ్రామస్తులంతా జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు.

ప్రత్యేక పూజలు..



ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోట దుర్గమ్మ ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, కుంకుమార్చనలు చేపట్టారు.

\- పాలకొండ

వితరణ..



భామిని మండలం బత్తిలి ఇమ్మాన్యుయేల్ ప్రార్థనా మందిరంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పేద పాస్టర్లకు దస్తులు, నిత్యావసర సరుకులు అందజేశారు. బత్తిలి సంతోషిమాతా ఆలయ కమిటీ చైర్మన్ భానుప్రసాద్ సాహూ చేతుల మీదుగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఖమ్మంనకు చెందిన గ్రేస్ సర్వీస్ సొసైటీ ఫౌండర్ వితరణతో జరిగిన కార్యక్రమంలో స్థానిక ప్రార్థనా మందిరం పాస్టర్ గంటా ఢిల్లీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

\- భామిని

మిల్లెట్స్ స్నాక్స్‌కు మార్కెట్ సౌకర్యం

మండలంలోని ఆదివాసీ గిరిజనులు తయారు చేస్తున్న చిరుధ్యానాల చిరుతిళ్లు (మిల్లెట్స్ స్నాక్స్)కు మార్కెట్ సౌకర్యం కల్పించనున్నట్లు వెలుగు ఏపీఎం మీసాల చక్రపాణి తెలిపారు. మండలంలోని బొడ్డగూడలో మిల్లెట్స్ స్నాక్స్ తయారీ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాస్పిరేషన్ బ్లాక్ కింద ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి ఇస్తున్న ప్రోత్సాహంతో గిరిజనులు చేస్తున్న వ్యాపారానికి ప్రోత్సాహం అందిస్తామన్నారు. పరిశీలనలో వెలుగు సీసీలు వలరౌతు చిట్టిబాబు, ఎఫ్ఆర్‌పీ బిడ్డిక లోకనాథం, బొబితా, సుహాసిని, తదితరులున్నారు.

\- భామిని



సందడిగా నూతన సంవత్సర వేడుకలు..



సీతంపేట: ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న సిబ్బంది



సీతంపేట: మాజీ ఎమ్మెల్యే కళావతికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న సీతంపేట మండల వాసులు



భామిని: ఓ ఇంటి ముందు వేసిన ముగ్గు



వీరఘట్టం: ఆకట్టుకుంటున్న రాధాకృష్ణుల ముగ్గు

నూతన సంవత్సర వేడుకలు వాడవాడలా బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. పాలకొండ, కురుపాం నియోజకవర్గ ప్రజలు నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. ప్రతి ఇంటి ముందూ వెల్‌కమ్ 2025 అంటూ రంగురంగుల ముగ్గులు వేశారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలు కాగానే చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ హ్యాపీ న్యూ ఇయర్ అంటూ సందడి చేశారు. అధికారులు, రాజకీయ నాయకుల ఇళ్ల వద్ద పండగ వాతావరణం నెలకొంది. మాజీ ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, పాముల పుష్పశ్రీవాణి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణలకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పోటెత్తారు. అలాగే ఐటీడీఏ వద్ద పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డికి అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. పలుచోట్ల నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు.

\- పాలకొండ/కురుపాం నెట్‌వర్క్



పాలకొండ: నూతన సంవత్సర వేడుకల్లో విక్రాంత్, రెడ్డి శాంతి, తదితరులు



కొమరాడ: జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మికి నూతన సంవత్సరం శుభాకాంక్షలు చెబుతున్న వెలుగు సిబ్బంది



వీరఘట్టం: మాజీ ఎమ్మెల్యే కళావతికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న వీరఘట్టం పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు



జియ్యమ్మవలస: చినమేరంగిలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి, శత్రుచర్ల పరీక్షిత్‌రాజు దంపతులు



జియ్యమ్మవలస: ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ్ చిత్రాన్ని పెన్సిల్‌తో వేసి అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, డ్రాయింగ్ టీచర్ శ్రీనివాసరావు



గుమ్మలక్ష్మీపురంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి నూతన సంవత్సర శుభకాంక్షలు చెబుతున్న నాయకులు, అధికారులు



గుమ్మలక్ష్మీపురం : మూలజమ్ములో కేక్ కట్ చేస్తున్న గ్రామస్తులు



గరుగుబిల్లి: నూతన సంవత్సర వేడుకలలో వైద్యసిబ్బంది

క్యాలెండర్ల ఆవిష్కరణ

వీరఘట్టం: మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రూపొందించిన 2025 వార్షిక క్యాలెండర్, డైరీని బుధవారం తమ కార్యాలయంలో ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్. ఆనందరావు ఆవిష్కరించారు. అలాగే యూటీఎఫ్ 50 వసంతాల స్వర్ణోత్సవ పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి, విద్యారంగ బలోపేతానికి కృషి చేస్తామని యూటీఎఫ్ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.పైడిరాజు, ఎస్.రాజకుమారి, బి.దుర్గాప్రసాద్, కె.గోవిందరావు, వి.విన్నాజీ, కె.గౌరినాయుడు, ఎం.ముకుందరావు, చంద్రమౌళి, వాసుదేవరావు, ఎ.స్వామిబాబు, సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ కేలండర్ ఆవిష్కరణ

గరుగుబిల్లి: పీఆర్‌టీయూ కేలండర్‌ను ఎంపీపీ ఉరిటి రామారావు బుధవారం ఆవిష్కరించారు. మండలంలోని మరుపెంట గ్రామంలో ఆయన స్వగృహంలో కొత్త సంవత్సరం సందర్భంగా పీఆర్‌టీయూ నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బొత్స రవికుమార్, మద్రాపు రామారావునాయుడు, కె.మురళిమోహన్ పాల్గొన్నారు.



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు గౌరినాయుడు, ఆనందరావు, ఉపాధ్యాయులు



పీఆర్‌టీయూ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రామారావు

ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలి

- రైతుసంఘ నాయకులు

భామిని: మండలంలోని వడ్డంగి వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, మండల అధ్యక్షుడు బోగాపురపు అప్పలనాయుడు, కార్యదర్శి భూపతి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలో ఎండిపోయిన చెరువులను స్థానిక రైతులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కరువు రైతులపై దృష్టి సారించాలని సూచించారు. గతంలో 2019 ఎన్నికల ముందు టీడీపీ నాయకులు హుటాహుటిన కాట్రగడ-బి వద్ద ఎత్తిపోతల పథకానికి శిలాఫలకం వేసి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. ఇప్పుడు అధికారంలో ఉన్న నేపథ్యంలో పథకం పూర్తి చేయాలని కోరారు. సాగునీరందక పంటలు పాడవుతున్నాయని, పాలకులు రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు బోదెపు రఘుపతి నాయుడు, బోదెపు శేషగిరి, నీటి సంఘ అధ్యక్షుడు బోదెపు సుధాకర్, ఉపాధ్యక్షుడు గార మోహనరావు, రైతులు పాల్గొన్నారు.



నీరు లేని వడ్డంగి చెరువు వద్ద ఆందోళన చేస్తున్న రైతు సంఘ నాయకులు

ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఏర్పాటు

పాలకొండ రూరల్: ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బ్రహ్మేంద్ర, గణేష్ ఎన్నికయ్యారు. ఈ క్రమంలో నిర్వహించిన మహాసభలో జిల్లా కమిటీ సభ్యుడు సూర్య మాట్లాడుతూ.. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పాలకొండలో ఇంటర్ విద్యార్థులకు సంబంధించి ఉన్న హాస్టళ్లలో మెరుగైన ఏర్పాట్లు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం భవిష్యత్‌లో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. సమావేశంలో లక్ష్మణరావు, సత్య, వరుణ్, రాజేష్, తదితరులున్నారు. అంతకుముందు తమ డిమాండ్లకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

గరుగుబిల్లి:

మామిడి, జీడిమామిడి తోటల్లో సరైన యాజమాన్య పద్ధతులను నిర్వహిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారి ఆర్.వి జయభారతి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మామిడి, జీడి తోటల్లో పొగమంచు కారణంగా పూత రాలిపోవడం, పూత మాడిపోవడం జరుగుతుందన్నారు. దీని నివారణ కోసం ఐదు గ్రాముల జింకు సల్ఫేట్, రెండు గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్, రెండు గ్రాముల బోరాక్స్, రెండు గ్రాముల కాపర్ సల్ఫేట్, రెండు గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్‌ను లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. పూత, పిందె దశలో చెట్టుకు ఆశించే రసం పీల్చే పురుగుల నివారణకు, రాతిమంగుకాయ పురుగు నివారణకు 0.5 ఎంఎల్ పాస్ఫామిడాన్ మందుగాని, మూడు గ్రాముల కార్బరిల్ మందుగాని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పువ్వు విచ్చుకొనే దశలో 2.5 ఎంఎల్ క్వినాల్‌ఫాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే తెగులు, పురుగుల బారి నుండి అధిగమించి అధిక దిగుబడులను పొందవచ్చునన్నారు.



గరుగుబిల్లిలో మామిడిపూత

ప్రయాణికులకు మెరుగైన సేవలు

- డీఎం వెంకటేశ్వరరావు

పాలకొండ రూరల్: ఆర్టీసీ ప్రయాణికులకు కొత్త ఏడాదిలో మరింత మెరుగైన సేవలు అందించేందుకు నూతన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు డీఎం పి.వెంకటేశ్వరరావు అన్నారు. డిపో సిబ్బంది, సహ ఉద్యోగులు బుధవారం నూతన సంవత్సర వేడుకలు డిపో ఆవరణలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డీఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రయాణికుల పట్ల గౌరవ పూర్వకంగా మెలగాల్సిన తీరు.. కార్గో సేవల విస్తరణ.. నూతన బస్సుల వినియోగం.. గ్యారేజీ నిర్వహణ.. ప్రమాద రహిత ప్రయాణాలపై ఉద్యోగులతో సమీక్షించారు. ఈ నేపథ్యంలో సిబ్బంది పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.



డీఎం వెంకటేశ్వరరావుకు శుభాకాంక్షలు చెబుతున్న సహ ఉద్యోగులు

యువత సత్ప్రవర్తనతో మెలగాలి

రామభద్రపురం: యువత సత్ప్రవర్తనతో మెలగుతూ జీవనోపాధి కలిగే ఏ రంగంలోనైనా లక్ష్యాలను చేరుకోవడానికి కృషి చేయాలని సీఐ కె.నారాయణరావు అన్నారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీరాంనగర్ కాలనీ సమీపంలో గల క్రికెట్ క్రీడా మైదానంలో ఆయన యువతకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సెల్‌ఫోన్ వినియోగం, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపైన బుధవారం అవగాహన కల్పించారు. యువత భవిష్యత్‌పై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుకు బానిసవ్వకుండా భవిష్యత్ గురించి ఆలోచించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురికావద్దని హితవు పలికారు. లైసెన్స్‌తో పాటు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించి వాహనం నడపాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

రామభద్రపురం: మండలంలోని ఆరికతోటలో క్రిస్మస్ పండగ వేడుకలలో భాగంగా ఏడీఎంఎం బాప్టిస్ట్ చర్చ్ సంఘం పెద్దలు సుమారు 900 మంది పేదలకు చీరలు, పంచెలు తదితర దుస్తులు బుధవారం పంపిణీ చేశారు.

సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని 20, 21వ వార్డుల్లో నూతన సంవత్సరం సందర్భంగా సీఐటీయూ, ఐద్వా, ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు బి.లక్ష్మి, ఉపాధ్యాయ నాయకురాలు కమల మాట్లాడుతూ మహిళలు ఐక్యంగా సామాజిక స్పృహతో ఎల్లప్పుడూ వ్యవహరించాలని, తాము ఎదుర్కొంటున్న సమస్యలను నిర్భయంగా ఎదుర్కొనేందుకు మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహిళలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ముగ్గుల పోటీలలో విజేతలుగా నిలిచిన గౌతమి, దీపిక, యామిని తదితరులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మణికంత, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్ మురళీధర్ రావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు కమల, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ వ్యవహరించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు సింహాచలం, సుజాత, పద్మ, వి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఐద్వా నాయకులు